క్లుప్తంగా

ఆక్రమణల తొలగింపు



డబ్బా దుకాణాన్ని తొలగిస్తున్న సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో రోడ్లను ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న డబ్బా దుకాణాలను కేఎంసీ సిబ్బంది తొలగిస్తున్నారు. శుక్రవారం నగరంలోని ఎన్నెస్పీ గెస్ట్‌హౌస్ వద్ద కాల్వ, రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన డబ్బా దుకాణాన్ని టౌన్ ప్లానింగ్ సిబ్బంది డీఆర్ఎఫ్ సిబ్బందితో తొలగింపజేశారు.

గురుకులంలో వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

నేలకొండపల్లి: నేలకొండపల్లి మండల కేంద్రంలోని బాలికల వసతి గృహం, సింగారెడ్డిపాలెంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రుగ్మతలను పరీక్షించి మందులు అందించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి ఆర్.శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. పిల్లలలో శక్తి మేథస్సు రక్షణకు అయోడైజ్డ్ ఉప్పు దోహదపడుతుందని, ప్రతీ రోజు వ్యాయామం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హాస్టల్ సంక్షేమాధికారి మున్నీసా బేగం, సౌజన్య, గురుకుల కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.పద్మావతి, హెచ్ఈఓ వీరన్న, వై.రాణి, కళావతి పాల్గొన్నారు.

'బ్లూమింగ్ మైండ్స్'లో ఆరెంజ్ కలర్ డే

ఖమ్మంఅర్బన్: నగరంలోని బల్లేపల్లిలో గల బ్లూమింగ్‌మైండ్స్ పాఠశాలలో శుక్రవారం ఆరెంజ్ కలర్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని తరగతి గదుల్లో కాషాయ రంగు బెలూన్లతో అలంకరించి అదే కలర్‌లో దుస్తులు ధరించి వివిధ రకాల పండ్లు, కూరగాయలను ప్రదర్శనగా ఉంచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పి.అశోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వి.కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన విద్యార్థులను అభినందించారు.

ఓటు నమోదు చేసుకోండి

ఖమ్మం సహకారనగర్: నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హులందరూ వచ్చే నెల 6వ తేదీలోగా ఓటు నమోదు చేసుకోవాలని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మినేని అనిల్‌కుమార్, ముత్తినేని సురేష్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఫారం–19 ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నివాళి

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు గ్రామంలో సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు, పాలేరు ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఉపాధ్యాయుడు సాలె సుందరయ్య సతీమణి శాంతమ్మ (78) శుక్రవారం మృతి చెందారు. ఈమేరకు వివిధ పార్టీల నాయకులు, అటవీశాఖ అధికారులు శాంతమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం జిల్లా నాయకులు కె.నర్సయ్య, నాయకులు దొండేటి ఆనందరావు, పద్మనాభుల సుధాకర్, మాజీ సర్పంచ్ అంగడి వీరస్వామి, మండడి ఇబ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

విరమించుకోవాలి

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలకు అనుసంధానంగా ఉన్న సర్దార్ పటేల్ స్టేడియం చుట్టూ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించే ప్రతిపాదనను అధికారులు విరమించుకోవాలని ఆ కళాశాల పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు నల్లమోతు తిరుమలరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

బ్యాంక్ మిత్రకు సన్మానం

కామేపల్లి : మండలంలోని పండితాపురం గ్రామంలోని ఏపీజీవీబీలో బ్యాంక్ మిత్రగా పని చేస్తున్న యండ్ర ఉమారాణి ఉత్తమ సేవలు అందించినందుకు గానూ బ్యాంక్ మేనేజర్ పి.శ్రీనివాస్ ఆమెను శుక్రవారం అభినందించి సన్మానించారు. బ్యాంక్ మిత్రాలు గ్రామంలో బ్యాంకింగ్ సంబంధిత అన్ని సేవలను ఖాతాదారులకు అందించాలని, అర్హత కలిగిన ప్రతీ ఖాతాదారుడికి జీవిత బీమా, ప్రమాద బీమా సేవలను అందించాలన్నారు. ఫీల్డ్ ఆఫీసర్ జయప్రకాశ్, క్యాషియర్ ఉపేంద్రమ్మ, బ్యాంక్ సిబ్బంది రామనాగయ్య పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	దేవర
వినోద	వేనమ్
సాయిరాం	విశ్వం
ఆదిత్య	రాధేకృష్ణ
శ్రీనివాస	లగ్గం, వేట్టయన్: ద హంటర్

– ఖమ్మంగాంధీచౌక్

క్రమబద్ధీకరణపై కసరత్తు..!

ఎల్ఆర్ఎస్‌కు చిక్కుముడులు
- ధ్రువీకరణ పత్రాలు చూపేందుకు దరఖాస్తుదారుల విముఖత
- క్షేత్రస్థాయి పరిశీలనకు వెనకడుగు
- 1,631 దరఖాస్తులు స్వీకరణ
- ఒత్తిడిలో అధికారులు

గ్రామ పంచాయతీలలో లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు స్థలాలు కొనుగోలు చేసి దరఖాస్తు చేసుకున్న వాటిని పరిశీలించాలని ఆదేశించింది. సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తుండగా.. సమస్యలు బయటపడుతుండడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మరోవైపు త్వరగా పూర్తి చేయాలని అధికారులు ఒత్తిడి తేవడంతో సతమతమవుతున్నారు. గతంతో పోలిస్తే పరిస్థితులు మారిపోవడంతో ప్రక్రియ ఎలా పూర్తి చేస్తారో వేచి చూడాలి. తెలంగాణ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ప్రవేశపెట్టడంతో మండలంలో భారీగా దరఖాస్తులు అందించారు. కానీ అధికారులు పిలిస్తే ముందుకు రావడం లేదు. – నేలకొండపల్లి

మండలంలో 1,631 దరఖాస్తులు..

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ల్యాండ్ రెగ్యులైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)నకు మండలంలోని 12 గ్రామ పంచాయతీల నుంచి మండల రెవెన్యూ అధికారులకు 1,631 దరఖాస్తులు అందాయి. ఇందులో నేలకొండపల్లి నుంచి 1,415, కొత్తకొత్తూరు 171, బోదులబండ 14, అమ్మగూడెం 11, రాజేశ్వరపురం 7, నాచేపల్లి 4, గువ్వలగూడెం, ముజ్జుగూడెం, పైనంపల్లి నుంచి రెండేసి చొప్పున, భైరవునిపల్లి, చెరువుమాధారం, తిరుమలాపురం నుంచి ఒక్కొక్కటి చొప్పున దరఖాస్తులు అందాయి. రెండేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్న అర్జీదారులను రెవెన్యూ అధికారులు డాక్యుమెంట్ల వెరిఫికేషన్‌కు రావాలని చెప్పినా వారు వెనకడుగు వేస్తుండడం గమనార్హం.

ఇబ్బందులు అనేకం..

ఎల్ఆర్ఎస్ కట్టిన వారిలో చాలా మంది భవనాలు నిర్మించుకున్నారు. దరఖాస్తు సమయంలో పొందుపరిచిన ఫోన్ నంబర్లు సరిగా లేవు. ఎల్ఆర్ఎస్ చేయాల్సిన స్థలాలు కొందరు అమ్మేశారు. ఇప్పుడు ముందుకు రావాలని చెబితే స్పందించడం లేదు. పలు గ్రామాల్లో నాన్ లే అవుట్ వెంచర్లు వేసి రియల్టర్లు ప్లాట్లను తక్కువ ధరకు అమ్మేశారు. తమకు ఎలాంటి సమస్య రావొద్దని స్థలం కొనుగోలు చేసిన యజమానికి తెలియకుండానే ఎల్ఆర్ఎస్ కట్టారు. పరిశీలన సమయాన పంచాయతీ కార్యదర్శులు ఫోన్ చేసి ఎల్ఆర్ఎస్ చేసుకోవాలని సూచిస్తే యజమానులు అవాక్కుతున్నారు. ఈ సమస్య నేలకొండపల్లి, కొత్తకొత్తూరు, సింగారెడ్డిపాలెంలో అధికంగా ఉంది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తు సమయాన ప్రభుత్వ పట్టా లేకపోతే రిజిస్ట్రేషన్ సమయంలో ప్రతాలు అప్‌లోడ్ చేయాలి. కానీ చాలా మంది ఇరువురు మధ్య ఒప్పందం రాసుకున్న స్టాంప్ పేపర్లను అప్‌లోడ్ చేశారు. దీంతో స్థలం వద్దకు వెళ్లి చూడగా సమస్య తలెత్తుతుంది.



నేలకొండపల్లిలో ఓ వెంచర్‌లో వెలిసిన ఫ్లెక్సీ

కుదరని సమన్వయం..

దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ మూడు దశలలో ఉంటుంది. ఎల్–1లో మండల రెవెన్యూ అధికారి, నీటి పారుల శాఖ ఏఈ, పంచాయతీ కార్యదర్శులు స్థలాన్ని పరిశీలించి అది ప్రభుత్వ భూమా..? కోర్టు కేసులు ఉన్నాయా? అనేది చూడాలి. కొన్ని సందర్భాల్లో అధికారుల మధ్య సమన్వయం కుదరకపోవడంతో దరఖాస్తులు పెండింగ్‌లో ఉండాల్సి వస్తోంది.

క్రమబద్ధీకరణ చేసుకోవాలి..



క్రమబద్ధీకరణను సద్వినియోగం చేసుకోవాలి. భూ యజమానులు తమ ధ్రువీకరణ పత్రాలు చూపించి స్థలాలను నిర్ధారించుకోవాలి. ఎల్ఆర్ఎస్ ద్వారా వారి స్థలాలు ఎక్కడ ఉన్నాయని తెలుసుకోవచ్చు.

– జె.మానిక్‌రావ్, తహసీల్దార్

అనుమతులు తప్పనిసరి..



సమస్యలు అధిగమించి క్రమబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేస్తాం. మండలంలో దరఖాస్తుదారులందరికీ సమాచారం అందించాం. అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణం చేపట్టనీయం. అందుకు తగ్గట్టుగా ఆదేశాలు జారీ చేశాం.

– సీహెచ్.శివ, మండల పంచాయతీ అధికారి

నోటీసులు ఇవ్వాలి..



ఎల్ఆర్ఎస్ లేకుండా స్థలాలను విక్రయించిన రియల్టర్లకు నోటీసులు ఇవ్వాలి. నాన్ లే అవుట్ వెంచర్లు వేసి ప్లాట్లను విక్రయించారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన రియల్టర్లపై చర్యలు తీసుకోవాలి.

– పసుమర్తి శ్రీనివాస్, సామాజిక కార్యకర్త

వనసమారాధన పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మంవైద్యవిభాగం: వచ్చే నెల 3 ఆదివారం రోజు నిర్వహించనున్న సకల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన వనసమారాధన కార్యక్రమ పోస్టర్లు, కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు, ప్రభుత్వాస్పత్రిలో సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో టీజీఓ నాయకులు ఈటబాబు రత్నాకర్, ఆస్పత్రి ఆర్ఎంఓలు కళావతిభాయి, రాంబాబు, రాథోడ్, పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ ప్రేమలత, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ మాధవరావు, సూపరింటెండెంట్ రవికిశక్షర్, మినిస్టీరియల్ సిబ్బంది, టీఎన్‌జీఓ నాయకులు గుంటుపల్లి శ్రీనివాస్, జైపాల్, పెద్దినేని రాధాకృష్ణ ఆయుష్ ప్రకాష్, చంద్రశేఖర్, నెల్లూరి రవి కుమార్, ప్రవీణ్ కుమార్, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్

చిన్నారిని అభినందించిన గవర్నర్



హర్షితను అభినందిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన పోటీల్లో నాట్య బాల అవార్డు అందుకున్న చిన్నారి ఎం.హర్షితను గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అభినందించారు. శుక్రవారం కలెక్టరేట్‌కు వచ్చిన గవర్నర్‌ను హర్షిత తన తల్లిదండ్రులతో కలవగా.. అభినందించారు.

గవర్నర్‌ను కలిసిన బీజేపీ నేతలు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా ఖమ్మం వచ్చిన తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మను బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ శుక్రవారం ఎన్నెస్పీ గెస్ట్‌హౌస్‌లో మార్యద పూర్వకంగా కలిశారు. అనంతరం శాలువతో సత్కరించారు. ఆయన వెంట జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్యామ్‌రాథోడ్, నున్నా రవికుమార్, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, నాయకులు కుంచెం కృష్ణారావు, పసుమర్తి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక బలోపేతానికి కృషి

నేలకొండపల్లి: స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఐకేపీ ఏపీఎం అశోక్‌రాణి అన్నారు. శుక్రవారం మండలంలోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు అసీల్ కోడి పిల్లలను పంపిణీ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. మండల సమాఖ్య ఆధ్వర్యాన తమిళనాడు నుంచి తీసుకొచ్చి మండలంలోని 45 సంఘాల సభ్యులకు 50 చొప్పున అందించినట్లు పేర్కొన్నారు. మండలస్థాయిలో మదర్ యూనిట్ 2 వేల పిల్లలతో (ఫ్రాల్టీ) యూనిట్‌ను స్థాపించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎవరైనా యూనిట్ ఏర్పాటు చేయాలనుకుంటే రూ.30 చొప్పున 2 వేల పిల్లలను అందించనున్నామని, 350గ్రాముల కోడి పిల్ల రూ.105 చొప్పున విక్రయించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య ప్రతినిధులు శ్రీలత, సుభద్ర, పద్మ, సీసీలు పెద్దపాక వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'డేర్'లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

ఖమ్మంరూరల్: మండలంలోని సత్యనారాయణపురంలో గల డేర్ ఇంజనీరింగ్ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల జేబీ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యాన ఫ్యాకల్టీ ప్రోగ్రామ్ నిర్వహించారు. శుక్రవారం ఏఐసీటీఈ మార్గదర్శన్‌లో భాగంగా నిర్వహించిన ఈ ప్రోగ్రామ్‌లో జేబీఐటీ కళాశాల అకడమిక్ డీన్, ఏఐసీటీఈ మార్గదర్శన్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎండీ సలావుద్దీన్ మాట్లాడారు. ఫ్యాకల్టీగా ఎదగడానికి క్రియేటివిటీ, కమ్యూనికేషన్ స్కిల్స్, లెర్నింగ్ అవుట్‌కం, కెరీర్ డెవలప్‌మెంట్, పేపర్ పబ్లికేషన్లను అలవర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దరిపల్లి కిరణ్, కరస్పాండెంట్ డి.స్వాతి, అకడమిక్ ఇన్‌చార్జ్ డాక్టర్ శిరీష, సతీష్, రమ్యశ్రీ, రవికుమార్, రమేష్, ప్రవీణ్, పుల్లయ్య,రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవలో జేయూహెచ్

ఖమ్మం మామిళ్లగూడెం: జమాతే ఇస్లామి హింద్(జేయూహెచ్) గత 75 ఏళ్లుగా దేశంలో ప్రజల సేవలో నిమగ్నమై ఉందని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఖలీద్‌ముబష్షిర్ ఉజ్‌జాఫర్ అన్నారు. శుక్రవారం ఖమ్మం అజీజ్‌గల్లీలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల ద్వారా నిరుపేదలకు ఉచిత వైద్యం అందిస్తుందని, అదనంగా సాంకేతిక విద్య సాయం, ఉచిత కంప్యూటర్ విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మున్నేరు వరద బాధితులకు సహాయ కార్యక్రమాల్లో తమ సంఘం అండగా నిలిచిందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు డాక్టర్‌ముబషిర్ అహ్మద్, ఎండీ ఇలియాస్, జైనుల్‌పాషా, అబ్దుల్ సమీ, అబ్దుల్ మల్లిక్, నిజాముద్దిన్, షేక్.రఫీ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ పంటల సర్వే ప్రారంభం

నేలకొండపల్లి: మండలంలోని కోరట్లగూడెంలో వ్యవసాయ విస్తీర్ణాధికారి అవినాష్ శుక్రవారం డిజిటల్ పంట సర్వే ప్రారంభించారు. ఇటీవల డిజిటల్ పంట సర్వే తాము చేయలేమని ఏఈఓలు ప్రకటించడంతో వీరికి వ్యవసాయ శాఖ మెమోలు జారీ చేసింది. దీంతో వారు సర్వేను ప్రారంభించారు. కాగా, జిల్లా వ్యవసాయ విస్తీర్ణాధికారుల సంఘం అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా మాట్లాడుతూ.. ఏఈఓల సర్వేకు సహాయక సిబ్బందిని ఏర్పాటు చేయాలని, మహిళా ఏఈఓలకు భద్రత కల్పించాలని కోరారు.


మార్కెట్ కార్యదర్శి వర్సెస్ సూపర్‌వైజర్

నేలకొండపల్లి: స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయం అధికారుల మధ్య వివాదం తారాస్థాయికి చేరింది. పరస్పరం చైర్మన్‌కు ఫిర్యాదు చేసుకోగా, అధికారితో అమర్యాదగా మాట్లాడడంపై సూపర్‌వైజర్‌కు మెమో జారీ అయింది. నేలకొండపల్లి మార్కెట్ కార్యదర్శి నాగేశ్వరి, సూపర్‌వైజర్ భాస్కర్ నడుమ విధుల విషయమై విబేధాలు వచ్చాయి. సూపర్‌వైజర్ శుక్రవారం అరగంట ఆలస్యంగా రావడంతో ఆయనకు సీఎల్ వేయడంతో ఇద్దరు గొడవ పడ్డారు. ఇటీవల ముదిగొండ మండలంలోని సువర్ణాపురంలో సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయగా ఇన్‌చార్జ్‌గా తనను కాదని జూనియర్‌కు బాధ్యతలు అప్పగించారని పేర్కొన్న సూపర్‌వైజర్, బిల్లుల విషయంతో పాటు అరగంట ఆలస్యంగా వస్తేసీఎల్ వేశారని కార్యదర్శితో వాదనకు దిగారు. ఇక సూపర్‌వైజర్ విధులు సరిగ్గా నిర్వర్తించడం లేదని, గోదాంలో ధాన్యం నిల్వల వివరాలు ఇవ్వాలని కోరినా పట్టించుకోవటం లేదని, ఇదేమిటని ప్రశ్నిస్తే ఏకవచనంతో అమర్యాదగా మాట్లాడరని కార్యదర్శి పేర్కొనగా ఇద్దరు మార్కెట్ చైర్మన్ సీతారాములుకు ఫిర్యాదు చేశారు. అంతేకాక తనతో అమర్యాదగా మాట్లాడారని సూపర్‌వైజర్‌పై జిల్లా అధికారులకు కార్యదర్శి ఫిర్యాదు చేయడమే కాక ఆయనకు మెమో జారీ చేశారు.

నేడు సీపీఎం మండల సభ

కూసుమంచి: మండలంలోని ముత్యాలగూడెం గ్రామంలో శనివారం సీపీఎం 10వ మండల సభను నిర్వహించనున్నట్లు పార్టీ మండల కార్యదర్శి ఎడవెల్లి రమణారెడ్డి, మండల కమిటీ సభ్యులు శీలం గురుమూర్తి, తోటకూరి రాజు తెలిపారు. ఈ సభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు పొన్నం వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, డివిజన్, మండల ఇన్‌చార్జ్‌లు బండి రమేష్, బుగ్గవీటి సరళ తదితరులు హాజరవుతారని, సభను విజయవంతం చేయాలని కోరారు.

వరద బాధిత టైలర్‌కు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: నగరంలోని మోతీనగర్‌కు చెందిన వరద బాధితురాలు చింతకిందిడి భానుకి స్నేహ హస్తాలు ఫౌండేషన్ సహకారంతో ఎన్‌బీకే సేవా సమితి ఆధ్వర్యాన శుక్రవారం రూ.13 వేల ఆర్థిక సాయమందించారు. వరదల్లో పాడైపోయిన కుట్టు మిషన్ రిపేర్ నిమిత్తం సేవాసమితి బాధ్యుడు నల్లమల రంజిత్ చేతుల మీదుగా అందించినట్లు దాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీను, షారుక్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ట్రైయినీ అధికారుల పర్యటన



తిరుమలాయపాలెం: అధికారులకు జ్ఞాపికలు అందిస్తున్న మండల అధికారులు



కామేపల్లి: పీహెచ్‌సీలో డాక్టర్‌తో మాట్లాడుతున్న ట్రైయినీ అధికారులు

☞ **తిరుమలాయపాలెం:** మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటిస్తున్న ట్రైయినీ సివిల్ సర్వీస్ అధికారుల బృందం పర్యటన శుక్రవారంతో ముగిసింది. ఈ నెల 18 నుంచి మండలంలోని ఇస్లావత్‌తండాలో అధికారులు రూపెష్ జహవాల్, తరుణ్‌పాండ్యా, సుమిత్ గోవింద్‌బామ మక్‌వానా, అభిషేక్ అండసు, ఉషాయాదవ్, సావంత్ మినాల్ మహాదేవ్‌లు గ్రామంలోనే ఉంటూ గిరిజనుల జీవన స్థితిగతులు, ప్రభుత్వ పథకాల అమలు తీరు, పరిపాలన విషయాలను తెలుసుకున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులకు మండల అధికారులు గ్రామంలో వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేసి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని రైతువేదిక, ప్రభుత్వ ఆస్పత్రి, కేజీబీవీ మహిళల విద్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, ఎంపీడీఓ కార్యాలయాలు అందిస్తున్న సేవలు, కేసుల నమోదులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పీవీ రామక్రిష్ణ, ఎంపీఓ సూర్యనారాయణ, వ్యవసాయ అధికారి సీతారాంరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ కె.నరసింహారావు ఆర్ఐలు వీరయ్య, లహరి, ఈజీఎస్ ఏపీఓ కె.నరసింహారావు, ఐసీడీఎస్ ఏసీడీపీఓ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు

☞ **కామేపల్లి:** శిక్షణలో భాగంగా మండలంలో ఐదు రోజుల పాటు వివిధ గ్రామాల్లో పర్యటించిన ట్రైయినీ సివిల్ సర్వీసెస్ అధికారులను ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికారులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కాగా ఈ బృందం కామేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, పోలీస్ స్టేషన్‌ను సందర్శించి అందిస్తున్న సేవలు, కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ బృందంలో మనీశ్ మీనా, సులేఖ జాగర్వాల్, అరుళ్‌సెల్వన్, నీలేశ్‌శ్రీకాంత్‌గైక్వాడ్, మధివధాని మండల అధికారులు ఎంపీడీఓ రవీందర్,తహసీల్దార్ సుధాకర్,వైద్యాధికారి నెల్లూరి చందన,ఈజీఎస్ ఏపీఓ శ్రీరాణి తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

ఖమ్మంవన్‌టౌన్: ఈ నెల 28న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. రక్తదాన శిబిరాలు, అనాథ, వృద్ధాశ్రమాల్లో అన్నదాన కార్యక్రమాలు, పేద విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలను చేపట్టాలని కోరారు.

విద్యార్థులకు టై, బెల్ట్‌లు, షూస్ వితరణ



టై, బెల్ట్‌లు, షూస్‌లతో విద్యార్థులు

తిరుమలాయపాలెం: మండలంలోని పాతర్లపాడు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు తన కుమారుడు గౌతమ్ జన్మదినం సందర్భంగా పాఠశాల విద్యార్థులకు రూ.25వేల విలువైన టై, బెల్ట్‌లు, ఐడీ కార్డులు, బ్లాక్ షూస్ అందజేశారు. ఈ సందర్భంగా జల్లెపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రాజేష్ మాట్లాడుతూ.. విద్యార్థులకు వితరణ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తమిర వెంకట్‌రెడ్డి, మద్దులపల్లి మార్కట్ కమిటీ డైరెక్టర్ జడల నగేష్, ఏఏపీసీ చైర్మన్ పూలమ్మ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ ధర్నా

ఖమ్మంరూరల్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన జలగంనగర్‌లో ధర్నా నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ఐదేళ్ల నుంచి రూ.8,300 కోట్ల బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని, స్కాలర్‌షిప్‌తో సంబంధం లేకుండా చదువు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో ఉంటూ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్వాతి, నవ్య, సింధు తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల వేలం

కామేపల్లి: మండలంలోని కొత్తలింగాల కోటమైసమ్మ తల్లి దేవాలయ పరిధిలోని దుకాణాలకు శుక్రవారం వేలంపాట నిర్వహించారు. ఈమేరకు కొబ్బరి కాయలు, పూజ సామగ్రిని విక్రయించుకునేందుకు రూ.90 వేలకు కొత్తగట్టు హైమా, కొబ్బరి చిప్పలు పోగుచేసుకునేందుకు రూ.10 వేలకు గుడవర్తి చైతన్య దక్కించుకోగా లడ్డు, పులిహోర ప్రసాదాలను అమ్ముకునేందుకు రూ.7 వేలకు గుడవర్తి విజయలక్ష్మి దక్కించుకున్నట్లు ఆలయ నిర్వాహణాధికారి శేషయ్య తెలిపారు.

ఫిర్యాదు

ఖమ్మం క్రైం: నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ పరిధిలో గల ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ వద్దకు నగరానికి చెందిన వ్యక్తి వెళ్లాడు. అక్కడ విధులు నిర్వహిస్తున్న ఫైనాన్స్ ప్రొఫెషనల్ ఎస్‌కె.మీరా దురుసుగా ప్రవర్తించినట్లు బాధితుడు టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఎంపీకి వినతి

నేలకొండపల్లి: ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డిని కాంగ్రెస్ పాలేరు నియోజకవర్గ సేవాదళ్ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు శుక్రవారం ఖమ్మం క్యాంపు కార్యాలయంలో కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం అందించారు. మండలంలో గ్రామీణ లింక్ రహదారులకు నిధులు కేటాయించాలని, కోరట్లగూడెంలో సీసీ రోడ్లు మంజూరు చేయించాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను వ్యవసాయ పనులకు అనుసంధానం చేయాలని కోరారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి



మాట్లాడుతున్న నర్సింహారావు

ఖమ్మంమయూరిసెంటర్: కార్మిక లోకానికి సమ్మె పెట్టుకునే హక్కు సంపాదించిన సంఘం ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ నెల 31న జరపనున్నట్లు సంఘ రాష్ట్ర కార్యదర్శి శింగు నరసింహారావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మంలోని గిరిప్రసాద్‌భవన్‌లో సంఘ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన ఆఫీస్ బేరర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక హక్కులు, సంక్షేమ చట్టాలను సాధించిన ఘనత సంఘానికి ఉందన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, కార్యనిర్వాహక అధ్యక్షుడు శివరామకృష్ణ, ఉపాధ్యక్షులు ఎండీ జాకీరుద్దీన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే విక్రయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ సరిత


ఖమ్మంరూరల్: ఎరువులు, పురుగుల మందులు రైతులకు ఎమ్మార్పీకే విక్రయించాలని కూసుమంచి ఏడీఏ సరిత తెలిపారు. మండలంలోని పొన్నేకల్ రైతువేదికలో శుక్రవారం ఎరువులు, పురుగుమందుల డీలర్లతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విక్రయించిన ప్రతీ దానికి రసీదు ఇవ్వాలని, దుకాణం ఎదుట ధరల పట్టిక బోర్డులు ఉండాలని, స్టాక్ వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని, నిబంధనలు ఉల్లఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఓలు ఉమా, నరేష్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు సక్కగలేవ్..!

రాష్ట్రంలో పెద్ద మార్కెట్‌లలో ఒకటైన ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో సౌకర్యాల కొరత వేధిస్తోంది. ప్రతి రోజు పంట విక్రయాల కోసం రైతులు వస్తుండగా.. వీరికి తాగునీరు కూడా అందుబాటులో ఉండడం లేదు. తాగునీటి ట్యాంకు అలంకార ప్రాయంగా మారగా.. వేయింగ్ మిషన్ పనిచేయక నిరుపయోగంగా ఉంది. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్



అలంకారప్రాయంగా ఉన్న తాగునీటి ట్యాంక్



నిరుపయోగంగా మారిన వేయింగ్ మిషన్